క్రిమినల్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

- ఓయూ లా ప్రొ. విజయలక్ష్మి
- అంబేడ్కర్ లా కళాశాలలో అవగాహన సదస్సు


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొ. విజయలక్ష్మి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రస్తుతం న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులపై న్యాయ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఓయూ లా ప్రొ. విజయలక్ష్మి అన్నారు. మంగళవారం అంబేడ్కర్ లా కళాశాలలో భారత నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. విజయలక్ష్మి మాట్లాడుతూ.. క్రిమినల్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. అనేక మంది అమాయకులు, పేదలు చేయని తప్పుకు కూడా శిక్షలు అనుభవిస్తున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. న్యాయ విద్యార్థులు డబ్బుల వైపు పరిగెత్తకుండా ఎంతో కొంత సమాజ హితానికి పని చేయాలన్నారు. కొత్తగా వచ్చిన చట్టాల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆమె నివృత్తి చేశారు.

◆ బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలకు చరమ గీతం పాడి కొత్త చట్టాలను తీసుకువచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ) చట్టం స్థానంలో భారతీయ న్యాయ సంహిత చట్టాలను 2024లో అమలులోకి వచ్చాయన్నారు. ఓయూ ప్రిన్సిపల్ డాక్టర్ రాధికా యాదవ్ మాట్లాడుతూ.. భారతీయ సార్వభౌమత్వాన్ని సమగ్రతను ఐక్యతను దెబ్బతీసే చర్యలకు పాల్పడడం నేరాలుగా పరిగణించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్, అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన, డాక్టర్ పద్మజ, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ముషీరాబాద్‌కు చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.2,40,500, గాంధీనగర్ డివిజన్‌కు చెందిన 10మంది లబ్ధిదారులకు రూ.3,50,000 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ రావడంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరులో ఆలస్యం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ చెక్కులు అందజేశామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా దరఖాస్తు చేసుకున్నా వారికి త్వరగా చెక్కులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాకేష్ కుమార్, శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్, ముఠా నరేశ్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం



పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డా. విశారదన్ మహరాజ్

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు
డా. విశారదన్ మహరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయనున్నట్లు ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. స్థానిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డా. విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో ధర్మ సమాజ్ పార్టీని బలోపేతం చేయడానికి సంస్థాగత నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల కమిటీల నిర్మాణంపై సమీక్షా నిర్వహించారు. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు అన్నెల లక్ష్మణ్, కండెల సుమన్, శ్రీకాంత్, మేకల సుమన్, తలారి రాంబాబు, రాష్ట్ర నాయకులు హరీష్‌గౌడ్, రెహమాన్, వినోద్ యాదవ్, రాఘవేంద్ర ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదు


ఇందిరాపార్కు ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

కవాడిగూడ: రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు డిమాండ్ చేశారు. కార్మికులు తమ సమస్యలను తెలపడానికి ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించుకోవడానికి పోలీసులు అనుమతి నిరాకరించడం, పలు షరతులు విధించడం సరికాదన్నారు. తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నాను చేపట్టారు.

◆ ఈ సందర్భంగా ఎస్ బాలరాజు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యాలను కాపాడడానికి నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది అడుగడుగున వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులను ఫేస్ స్కానర్ హాజర్ పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధుస్తున్నారని, విధులు నిర్వహించినా కూడా టెక్నికల్ సమస్యలతో కార్మికుల జీతాలు కట్ అవుతున్నాయని ఆరోపించారు. 60 ఏళ్లయిన వారి స్థానంలో వారి వారసులను ఉద్యోగంలోకి తీసుకొని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

◆ కార్మికులను పర్మినెంట్ చేసేవరకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేష్, తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, కార్యదర్శులు జైపాల్ రెడ్డి, కిషన్, డి.రాములు, ఉప ప్రధాన కార్యదర్శి పి. నర్సింగరావు, వర్కింగ్ ప్రసిడెంట్ పి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి సమాయత్తం!

యూపీహెచ్‌సీ పరిధిలో మొదలైన జ్వర సర్వే


బంజారాహిల్స్‌లో ఇంటింటా జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రులకు తరలింపు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో అప్రమత్తం
- పీహెచ్‌సీల పరిధిలో ఇంటింటా ముమ్మర సర్వే

బంజారాహిల్స్: వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమాయత్తమయ్యారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో ఇంటింటా జ్వర సర్వే ముమ్మరంగా జరుగుతుంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షౌకత్‌నగర్, శ్రీరామ్‌నగర్, వినాయకనగర్, బోరబండ, పంజగుట్ట, సోమాజీగూడ, ఖైరతాబాద్ యూపీహెచ్‌సీల పరిధిలో ఉన్న 33 బస్తీ దవాఖానాల పరిధిలో గత కొద్ది రోజులనుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే చేపడుతున్నారు. తాజాగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులకు జారీ చేసిన ఆదేశాలతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లోని పీహెచ్‌సీల వైద్యులు అప్రమత్తమయ్యారు. ఈ సర్వేలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు భాగస్వాములు అవుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 50 ఇళ్లల్లో నివసించే వారి ఆరోగ్య వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు.

జ్వర లక్షణాలు ఇలా..

జ్వరం, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నాయా..? లేదా..? అని ఇంటింటికీ వెళ్లి సంబంధిత వైద్య సిబ్బంది ఆరాతీస్తున్నారు. ఒకవేళ జ్వర లక్షణాలు ఉంటే ఎన్ని రోజుల నుంచి జ్వరం వస్తుంది..మందులు తీసుకున్నా సరే జ్వరం అలాగే ఉంటుందా..? అనే వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఏ సమయంలో జ్వర తీవ్రత ఎక్కువ ఉండి, ఆ సమయంలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి..? అనే వివరాలను కూడా సేకరిస్తున్నారు. గతంలో కొవిడ్ సమయంలో మూడు విడతల్లో ఇంటింటా జ్వర సర్వే చేపట్టారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో 1.45 లక్షల మంది ఆరోగ్య వివరాలను సేకరించడమే కాకుండా అవసరమైన వారికి తగిన మందులు కూడా ఇచ్చారు. దీని ద్వారా జ్వరం బారిన పడినవారు ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లకుండానే కోలుకున్నారు. అయితే గత ఏప్రిల్ నుంచి ఈసారి వాతావరణ మార్పులు భిన్నంగా ఉన్నాయి. ప్రతియేటా ఆగస్టు నుంచి డెంగీ కేసులు నమోదు కాగా ఈసారి జనవరి నుంచే ఈ వ్యాధి పంజా విసురుతోంది. ప్రతి బస్తీ దవాఖానా పరిధిలోనూ డెంగీ కేసులు నమోదవుతుండడం పట్ల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ సర్వేను మరింత పారదర్శకంగా చేపట్టారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సంక్రమిస్తే వాటిని నమోదు చేసుకోవడమే కాకుండా వారిని ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఆ చుట్టు పక్కల 300 ఇళ్లను సర్వే చేయడమే కాకుండా జీహెచ్‌ఎంసీకి సమాచారం ఇవ్వడం ద్వారా అక్కడ దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపడుతుంది. ప్రజారోగ్యం పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

రైతుల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని టీజేఎస్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రెండో విడత రైతులు రుణమాఫీ చేయడం పట్ల హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం గాంధీనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటుందన్నారు.

అన్నదానం



కాచిగూడ: యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెప్పల్‌బజార్‌లో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, సురేష్, సుభాష్‌పటేల్, బల్వీర్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

కాచిగూడ: బెంగళూరులో ఆగస్టు 4వ తేదీన జరిగే షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలకు జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ బి.ఆనంద్ అభినందించారు. విద్యార్థులు ఆటపాటల్లో ప్రావీణ్యం పొందితే వారి బాల్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ ఆర్‌టీఆర్160

లక్డీకాపూల్: నగర మార్కెట్‌లోకి టీవీఎస్ సరికొత్త బైక్‌ను విడుదల చేసింది. సోమాజీగూడలోని అంజలి టీవీఎస్ షోరూమ్‌లో అపాచీ ఆర్‌టీఆర్ 160 బైక్‌ను షోరూమ్ ఏఎస్ఎం సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

బీసీ విద్యార్థి సంఘం
రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో నామమాత్రంగా మాట్లాడి సమావేశాలను ముగించొద్దని కోరారు. జాబ్ కేలండర్‌ను పూర్తిస్థాయిలో ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు కట్ట హరీష్, ప్రభాకర్, గోపాల్, లోకేష్, స్వామి, ఉదయ్, శ్రీకాంత్, రాంబాబు, మల్లేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్
డా. రియాజ్

చిక్కడపల్లి: బోనాల ఉత్సవాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. టీఎన్‌జీఓ హైదరాబాద్ డిస్ట్రిక్ట్, నగర గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులు శాగంటి అయోధ్య, ప్రధానకార్యదర్శులు బొల్లం మహేందర్‌ల పర్యవేక్షణలో మంగళవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలోని రేణుకాఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ, పౌర గ్రంథాలయ సంచాలకులు ఏవీఎన్ రాజు, గ్రంథాలయ కార్యదర్శి పొట్లూరి పద్మజ, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, నేతలు విక్రమ్‌కుమార్, నగర కేంద్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ ప్రసన్నరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలోని ఆలయంలో కార్పొరేటర్ ఎ.పావని, కార్యదర్శి పద్మజ


నగర గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్

ఆధ్యాత్మిక భావాలు సన్మార్గంలో నడిపిస్తాయి


భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న విద్యాదీశ తీర్థ శ్రీపాదుల స్వామి

కాచిగూడ: ఆధ్యాత్మిక భావాలు మనిషిని సన్మార్గంలో నడిపిస్తాయని ఉడిపి జగద్గురు శ్రీమద్వాచార్య మూల మహా సంస్థానం పలిమారు మఠానికి చెందిన విద్యాదీశ తీర్థ శ్రీపాదుల స్వామిజీ అన్నారు. మంగళవారం లింగంపల్లిలోని రాఘవేంద్ర మి బృందావన సమితిలో భక్తులకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. భక్తి జ్ఞానమే మోక్షం ప్రసాదిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర బృందావన సమితి ప్రతినిధులు బీపీ రాఘవేందర్‌రావు, కృష్ణమూర్తి, అనంతమూర్తి, వెంకటేష్, చంద్రశేఖర్, మేనేజర్ కె.నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల కుట్రలో పడి విడిపోవద్దు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చెన్నయ్య తదితరులు

పంజగుట్ట: రాజకీయ పార్టీల కుట్రల్లో పడి ఎస్సీలు విడిపోరాదని, అందరం ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కుట్రలకు వ్యతిరేకంగా ఆగస్టు 8 నుంచి 10 వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాల సంఘాలన్నింటినీ కలుపుకుని పోయి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద హలో మాల.. చలోఢిల్లీ పేరుతో మహాధర్నా కరపత్రాన్ని మంగళవారం మాలమహానాడు జాతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో వందలాది మంది నాయకులతో మహా ధర్నా చేసి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టకుండా అడ్డుకుంటామని తెలిపారు. అనంతరం మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరిని నియమించి ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పాల్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కారంపూడి మైనర్ బాబు, రంతు లక్ష్మణ్, బడుగు సాల్మాన్, కందుకూరి జార్జ్, గొట్టిపాటి యోగి పాల్గొన్నారు.

నగర అవసరాలకు 7వేల బస్సులు కావాలి

- గ్రేటర్ హైదరాబాద్ సీపీఎం కార్యదర్శి ఎం.శ్రీనివాస్
- ప్రజా రవాణా అభివృద్ధికి ఆగస్టులో ప్రజా ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర్ హైదరాబాద్ సీపీఎం కార్యదర్శి శ్రీనివాస్

ముషీరాబాద్: నగరం విస్తరిస్తున్నా అదేస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని గ్రేటర్ హైదరాబాద్ సీపీఎం కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. గోల్కొండ క్రాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు నిత్యం ట్రాఫిక్ రద్దీతో, కాలుష్య సమస్యలతో తీవ్రంగా సతమతమవుతున్నారన్నారు. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు నిర్మించినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. నగరంలో ఎక్కువ మంది ప్రయాణించే బస్సులు, రైళ్లను పెంచకుండా ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. బస్సుల సంఖ్య పెరగకపోగా భారీగా తగ్గిపోయాయన్నారు. రవాణా నిపుణుల అంచనాల ప్రకారం నగర అవసరాలకు కనీసం 7వేల బస్సులు అవసరం ఉన్నాయన్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వం నగరంలో వీలైనంత త్వరగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సొంత వాహనాలు కొత్తగా ప్రతి ఏటా లక్షల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నాయన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ట్రాఫిక్ పద్మ వ్యూహంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నగరంలో ప్రజా రవాణా అభివృద్ధి కోసం బస్సులు, రైళ్ల పెంపుదల కోసం ఆగస్టులో సీపీఎం ప్రజా ఆందోళన కార్యక్రమం చేపడుతుందన్నారు. సంతకాల సేకరణతో పాటు ఇతర రూపాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రజలు సైతం పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు.

కవాడిగూడలో ముగిసిన బోనాలు


దేవిప్రసాద్ బాగ్‌లో ప్రత్యేక పూజలో పాల్గొన్న ముఠా జైసింహ

కవాడిగూడ: కవాడిగూడలో ఆషాఢమాసం బోనాల ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందిరాపార్కు చౌరస్తాలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద నిర్వాహకులు రేణుకాదేవి, నందిని ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ముషీరాబాద్ మాజీ కార్పొరేటర్ జి. అరుణ జయందర్‌బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా కవాడిగూడ డివిజన్ దేవీప్రసాద్ బాగ్‌లో భారీ తొట్టెల ఊరేగింపును బీఆర్‌ఎస్ యువ నేత ముఠా జైసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు శ్రీకాంత్, సురేష్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా మక్తాల శైలజగౌడ్

కాచిగూడ: మోకుదెబ్బ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా మక్తాల శైలజగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ మంగళవారం శైలజగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోకుదెబ్బ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... శైలజగౌడ్ 15 సంవత్సరాలుగా మోకుదెబ్బ ఆధ్వర్యంలో జరిగే కార్యాక్రమాల్లో పాల్గొంటూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాగు సిద్దిరాములు గౌడ్, ఏవీ బాలేషంగౌడ్, ఆంజనేయులుగౌడ్, సురేష్‌గౌడ్, ముత్యం నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాచ్‌మన్‌పై దాడి

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

కాచిగూడ: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వాచ్‌మన్‌పై మద్యం మత్తులో ముగ్గురు యువకులు అకారణంగా దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన చంద్రయ్య కుమారుడు ఆంజనేయులు (45) లలిత అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో ఆంజనేయులు పాల కోసం బర్కత్‌పుర ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో వెళ్తుంగా అక్కడే మాటు వేసిన ముగ్గురు గుర్తుతెలియని యువకులు వాచ్‌మన్‌పై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

పంజగుట్ట: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన ఈ నెల 14, 29వ తేదీల్లో సమావేశమైన సంఘం సభ్యులు అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షనీయమన్నారు.

కండక్టర్‌పై దాడి

పంజగుట్ట: ఫుట్‌బోర్డుపై ఉండకుండా బస్సు లోపలకు రావాలి అన్నందుకు కండక్టర్‌పై విద్యార్థులు దాడి చేసిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వెళుతుంది. ఈ క్రమంలో ఎస్సార్‌నగర్ వద్ద కొంతమంది విద్యార్థులు బస్సు ఎక్కి ఫుట్‌బోర్డుపైనే ఉండడంతో కండక్టర్ శ్రీనివాస్ బస్సులోపలకు రా వాలని సూచించాడు. దీంతో విద్యార్థులు కండక్టర్ శ్రీనివాస్‌పై దాడి చేసి పారిపోయారు. కండక్టర్ శ్రీనివాస్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనీలాండరింగ్ పేరుతో ప్రైవేట్ ఉద్యోగినికి టోకరా

హిమాయత్‌నగర్: మనీలాండరింగ్ కేసు నమోదైందని ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన 31 ఏళ్ల మహిళా ప్రైవేట్ ఉద్యోగినికి ట్రాయ్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి తన మొబైల్ నంబర్ నుంచి అక్రమంగా సందేశాలు వస్తున్నాయని చెప్పారు. దీనిపై ఖార్గర్ పోలీస్ స్టేషన్ నుంచి ఆర్డర్ ఉందని చెప్పారు. అనంతరం కేటుగాళ్లు పోలీసుల మారువేశంలో స్కైప్ వీడియో కాల్ చేశారు. తన బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరించి అందులో ఎంత బ్యాలెన్స్ ఉందో తెలుసుకుని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఆమె బ్యాంక్ ఖాతాలలో ఉన్న డబ్బును వెరిఫై చేసి తిరిగి చెల్లిస్తామని చెప్పారు. అనంతరం జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్ నిందితుడని, తాను వాగ్మూలంలో బాధితురాలు పేరు చెప్పాడని, ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.20లక్షలు చెల్లించాలని చెప్పారు. బాధితురాలి కోసం న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పి విడతల వారీగా రూ. 4,99, 700 కాజేసి మోసం చేశారు. దీంతో బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

'రాష్ట్రపతి పాలన విధించాలి'

లిబర్టీ: అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం విపక్ష నాయకులపై దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటానికి పూర్తిస్థాయి మద్దతు పలుకుతున్నామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 30–35పైగా హత్యలు, దాడులు కూల్చివేతలు జరిగాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఘటనపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పందించి న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిలువేరి వసంతరావు, గోలి నరేష్ పాల్గొన్నారు.